అగ్రిగోల్డు ఆస్తుల సమగ్ర సర్వే

విశాలాంధ్ర - విజయనగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అగ్రిగోల్డుకు సంబంధించిన ఆస్తులను సమగ్రంగా సర్వే చేసి పూర్తి వివరాలను అందజేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఇన్‌ఛార్జి కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం జరిగింది. జిల్లాలోని నాలుగు మండలాల్లో ఉన్న అగ్రిగోల్డు ఆస్తులు, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆస్తుల సంరక్షణకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. అగ్రిగోల్డు ఆస్తుల సర్వేను పూర్తి చేసి, వాటి వాస్తవ విలువను లెక్కించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సిఐడి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.ఎస్.భూపాల్, విజయనగరం, బొబ్బిలి ఆర్డీఓలు డి.కీర్తి, రామ్మోహన్, నాలుగు మండలాల తహశీల్దార్లు, వివిధ శాఖల ప్రతినిధులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కూటమిలో.. ఎవరి దారి వారిదే..

- జిల్లాలో కూటమి పార్టీల మధ్య కుదరని స్నేహహస్తం
- అన్ని నియోజకవర్గాలలో ఇదే తంతు
- అన్ని చోట్ల టీడీపీదే హవా

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంలో అధినేతల మాటెలా వున్నా విజయనగరం జిల్లాలో మాత్రం కూటమి పార్టీల మధ్య సయోధ్య లేదనే చెప్పాలి. నీకు నేను, నాకు నీవు అని పాడుకోవాల్సిన పార్టీలు నీ దారి నీదే.. నా దారి నాదే అనే రీతిలో వున్నాయి. అధికార కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య స్నేహగీతం ఆలపించే నియోజకవర్గమే కరువైంది.

విజయనగరం జిల్లాలోని 7 నియోజకవర్గాలలో నెల్లిమర్ల మినహా మిగిలిన నియోజకవర్గాలలో టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆయా నియోజకవర్గాలలో పేరుకు జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు ఉన్నా వారు అధికార కార్యక్రమాలలో కనిపించడం లేదనే చెప్పాలి. కారణాలు ఏమైనా సరే అందరూ సఖ్యతగా ఉండాలన్నది కూటమి ధర్మం, కానీ ఆయా నియోకవర్గాలలో టీడీపీ ఎమ్మెల్యేలదే హవా. చీపురుపల్లిలో అధికార పార్టీ ఎమ్మెల్యే కళా వెంకటరావు ఉన్నా రాష్ట్ర స్థాయిలో ఆయన బిజీగా ఉండడంతో పార్టీ తరుపున ప్రస్తుత డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, కిమిడి రామ్‌మల్లిక్ నాయుడులు పాలన సాగిస్తున్నారు. ఇక్కడ జనసేన ఇన్‌చార్జిగా ఉన్న విజినిగిరి శ్రీనివాసరావు ఏనాడూ టీడీపీతో కలిసి కార్యక్రమాలలో పాల్గొనడం కార్యకర్తలు చూడలేదు. జనసేన తరుపున ఆయన సొంతంగా పోరాటం చేస్తున్నారు. ఇక విజయనగరంలో చూస్తే స్థానిక ఎమ్మెల్యే అధితి గజపతిరాజు మాట వేదంగా మారింది. ఇక్కడ రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, గురాన అయ్యలు, అవనాపు విక్రమ్ వంటి వారు ఉన్నా వారంతా తమ సొంత పార్టీ కార్యక్రమాలకే పరిమిత మయ్యారు.



ఎస్.కోటలో జనసేన ఇన్‌చార్జి వబ్బిన సత్యనారాయణ స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారితో కలిసి అడపాదడపా తిరుగుతున్నా పార్టీకి ఉపయోగం లేదని పార్టీ కార్యకర్తలే పెదవి విరుస్తున్నారు. గజపతినగరంలో పేరుకు మర్రాపు సురేష్ ఉన్నా స్థానిక మంత్రి కొండపల్లితో పూర్తిస్థాయిలో కలవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. నెల్లిమర్లతో మాత్రం పరిస్థితి విచిత్రంగా మారింది. ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న లోకం మాధవి పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం దిశగా కృషి చేస్తున్నారు. గ్రామ స్థాయిలో పార్టీకి జీవం పోస్తున్నారు. ఇక్కడ తెలుగుదేశం పార్టీ నేతలకు, కార్యకర్తలకు రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు అంతా తానై చూసుకుంటున్నారు. రాజాంలో స్థానిక ఎమ్మెల్యే కొండ్రు మురళితో జనసేన నేతలు కలవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబీ నాయణ అంతా తానై వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

కానరాని బీజేపీ..

ఎన్నికల ముందు అడపాదడపా ఏదో ఒక పత్రికా సమావేశంతో సందడి చేసే బీజేపీ నేతలు ప్రస్తుతం అధికార కూటమిలో ఉండడంతో పూర్తిగా కనుమరుగయ్యారనే భావన అందరిలో కలుగుతోంది. రాష్ట్రంలో అధికార చేపట్టి దాదాపు ఏడాది గడుస్తున్నా గతంలో మాదిరిగా ఒక్క కార్యక్రమాన్ని నిర్వహించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా స్థాయిలోనే నేనున్నాననే నేత కనిపించకపోవడం విశేషం. అసలే గ్రామాలు, మండల స్థాయిలలో పార్టీ క్యాడర్ లేని బీజేపీ, జనసేన పార్టీలు పార్టీ బలోపేతం వైపు దృష్టి పెట్టడంలేదు.

దీంతో వచ్చే స్థానిక ఎన్నికలలో టీడీపీ నేతలే అన్ని స్థానాల్లో పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రాజకీయ పండితులు భావిస్తున్నారు.

అసంఘటిత రంగ కార్మికులు పథకాలను వినియోగించుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి హేమా స్రవంతి జానకిరామ్

విశాలాంధ్ర - బొబ్బిలి: అసంఘటిత రంగంలో జీవనం సాగిస్తున్న కార్మికులు కేంద్ర ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి హేమా స్రవంతి జానకిరామ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రోహిణి రావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వి.మోహన్ మురళీ కుమార్, కోర్టు సూపరింటెండెంట్ అధికారి అల్లు ప్రభాకర్‌రావు, న్యాయవాదులు భోగి దాసు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - బొబ్బిలి: గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ దాడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా వచ్చిన భక్తులకు కోట దక్షిణ దేవిడీ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) స్వయంగా మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. అలాగే గొల్లపల్లిలో అమ్మవారి గుడి దగ్గర కూడా భక్తులకు మజ్జిగ, ప్రసాదం ఏర్పాటు చేశారు.

గనిశెట్టిపాలెంలో సీతారామ ఆలయ ప్రతిష్ట

విశాలాంధ్ర - కొత్తవలస: మండలంలోని గనిశెట్టిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జ్ సముద్రాల విజయచందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ, నూతన ఆలయ ప్రారంభోత్సవం, నూతనంగా నిర్మించిన శ్రీ సీతా రామచంద్రస్వామి, జ్ఞాన సరస్వతి, విఘ్నేశ్వర ఆలయ శిఖర విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు గ్రామ పురోహితులు, కొత్తవలస దుర్గాదేవి ఆలయ ప్రధాన అర్చకులు వెలివెల లక్ష్మి శ్రీనివాసశర్మ (జయ సాయి శర్మ) పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాల్లో న్యాయమూర్తి హాజరయ్యారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సర్పంచ్ కోట్ల రఘు చొరవతో పురావస్తు శాఖ తనిఖీలు

- ఆ శివలింగానికి 700 ఏళ్ళు పైనే
- తేల్చిచెప్పిన పురావస్తుశాఖ
- మహర్దశ పొందబోతున్న కొవ్వాడ గ్రామం

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలో కొవ్వాడ అగ్రహారం పంచాయతీ గ్రామశివార్లలో గల శివుని ఆలయంపై పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ శివ లింగం స్వయంభూగా వెలసిందని, దీనిని తస్కరించేందుకు చూసినా ఈ శివలింగం కదలకపోవటంతో వదలిపోయారని ఇలా పలు కథనాలు ఉన్నాయి. దీంతో ఈ ఆలయంను అభివృద్ధి చేసేందుకు స్థానిక సర్పంచ్ కోట్ల రఘుతోపాటు గ్రామపెద్దలు నిర్ణయించారు. అసలు ఈ శివలింగం ఎప్పటిది అనే విషయంపై పురావస్తు అధికారులకు వీరు విన్నవించుకోవటంతో మంగళవారం ఆ శాఖ ఎడి ఆర్.పాల్గునరావు బృందం దీనిని పరిశీలించి ఆశక్తికర విషయాలను బయటపెట్టారు. ఇక్కడ శివలింగంతోపాటు చుట్టుప్రక్కల దొరికిన శిధిలాలు, విరిగిన దేవతా విగ్రహాలు పరిశీలించి ఈ శివలింగం 13వ శతాబ్దం పూర్వందని తెలిపారు. తురుష్కుల పాలనలలో చిన్నపాటిగా ఉన్న ఈ దేవాలయంలో విగ్రహాలను విరగ్గొట్టి ఉండవచ్చునని తెలిపారు. ముఖ్యమైన శివలింగం మాత్రం పాడవలేదని తెలిపారు. అయితే ఈ దేవాలయంలో ఉన్న మిగిలిన దేవతావిగ్రహాలు మాత్రం కొంత భాగాలు శిధిలం చేసినట్టు తెలిపారు. దీనికి చేరువలో ఉన్న మహిషాసుర మర్ధిని అమ్మవారి విగ్రహం మాత్రం దీనికన్నా పురాతనమైనదిగా గుర్తించారు. నాడు ఈ ప్రాంతాన్ని తూర్పు గాంగులు పరిపాలించే వారని వారి హయాంలో దీనిని నిర్మించి ఉండవచ్చునన్నారు. దీని ప్రాముఖ్యతవల్లే దీనిని గతంలో అగ్రహారంగా రాజులు ఇచ్చివేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఇంత చరిత్ర ఉన్న దీనిని పున: నిర్మించాలని నిర్ణయించినట్టు స్థానిక సర్పంచ్ కోట్ల రఘు విలేకరులకు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం: మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర - మెంటాడ: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గ్రామాల అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నిర్ణయాలతో ముందుకు సాగుతుందని స్త్రీ శిశు సంక్షేమ గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కొండలింగాల వలస గ్రామంలో మంగళవారం నూతన సచివాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోడ్లు, కాలువలు, వంతెనల సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. గ్రామ పంచాయితీలలో సర్పంచ్‌కు పూర్తి అధికారం కట్ట పెట్టడం వలన అభివృద్ధికి బాధ్యులను చేసిన వారం అవుతామని కూటమి ప్రభుత్వం గుర్తించి వారికి మొదటి ప్రాధాన్యతను కల్పిస్తున్నట్లు తెలిపారు. గత 40 సంవత్సరాల నుంచి గిరిజన గ్రామాలలో కనీసం రోడ్డు సదుపాయం లేదని ఇప్పుడు కూటమి ప్రభుత్వం ద్వారా గ్రామాల అభివృద్ధిలో మొదటి భాగంగా మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గానికి 200 కోట్ల రూపాయలు అభివృద్ధి కార్యక్రమానికి రాగా కేవలం మెంటాడ మండలానికి 100 కోట్లు వరకు పనుల రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి గిరిజన గ్రామాల్లో కూడా పిల్లలను స్కూలుకి పంపించి చదివించాలని మంచి చదువు చదువుకుంటే జ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, గొర్లె ముసలి నాయుడు, గెద్ద అన్నవరం, ఎంపీటీసీ గుమ్మడి ప్రవీణ్, సిరిపురం గురు నాయుడు, ఎస్టీ సెల్ అధ్యక్షులు గుమ్మడి సింహాచలం, గ్రామ సర్పంచ్ పాడి వరహాలమ్మ, కూటమి పార్టీ నాయకులు, ఎంపీడీవో భానుమూర్తి, హౌసింగ్ ఏఈ మహేశ్వరరావు, పంచాయితీ రాజ్ జేఈ గౌతమ్, ఎంఈఓ శివాజీ వర్మ, ఏపీవో చిన్నప్పయ్య, ఏవో గోకుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిషోర బాలికలు ఆరోగ్యవంతంగా ఉండాలి

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: కిషోర బాలికలు ఆరోగ్యవంతంగా ఉండాలని ఏసీడీపీఓ తవిటి నాయుడు అన్నారు. జూన్ 10వ తేదీ వరకు కిషోర వికాసం కార్యక్రమం జరుగుతుందని అన్నారు. మంగళవారం అంగన్వాడి కేంద్రం పరిధిలో ఉన్న కిషోర్ బాలికలకు ఋతుస్రావంపై మహిళా సంరక్షణ కార్యదర్శి భారతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కిషోర బాలికలు మంచి ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. పౌష్టికాహారం, బాలికలలో వచ్చే రుతు చక్ర సమస్యలు, బాలల హక్కులు, విద్యా, కెరీర్, బాల్య వివాహాలు, టీనేజ్ గర్భం, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, శారీరక వ్యాయామం వాటిపై దశలవారీగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ఆర్‌పిలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీపీటీవో

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: విజయనగరం ఏపీఎస్ ఆర్టీసీ డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం బుధవారం డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విజయనగరం ప్రజా రవాణా అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలో గల ప్రయాణికులందరూ ఎటువంటి సమస్యలున్నా బస్సు రూట్లు, సమస్యలు, సలహాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఫోన్ ద్వారా తెలిపి నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు. సమస్యలపై డీపీటీవో ఫోన్ నంబర్ 9959225604కు సంప్రదించాలన్నారు.

యాంటీ డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదక ద్రవ్యాలు వ్యసనం అంతం చేయడానికి వివిధ కార్యక్రమాలను రూపొందించింది. అందులో భాగంగా మిమ్స్ మెడికల్ కళాశాల విద్యార్థులు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వీరు మిమ్స్ కాలేజ్ మెయిన్ గేట్ నుండి నెల్లిమర్ల రామతీర్థం జంక్షన్ వరకు ఈ ర్యాలీని నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ లక్ష్మీ కుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.రఘురాం, మిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గణేష్, భోగాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, నెల్లిమర్ల సబ్ ఇన్‌స్పెక్టర్ గణేష్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: మండలంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆదేశాల మేరకు మరిపి విద్యాసాగర్ నేతృత్వంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ గేదెల తిరుపతి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాధనాన్ని, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాయడం జరుగుతుందన్నారు. ఈ విషయంపై సంవిధాన్ బచావో అభియాన్ అనే పేరుతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇన్చార్జ్ గేదెల తిరుపతి, విజయనగరం జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి హెచ్.నానాజీ, మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని మోసం చేస్తున్న కూటమి: జెడ్పీ చైర్మన్ మజ్జి

విశాలాంధ్ర - చీపురుపల్లి: రాష్ట్రంలో రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తూ మోసం చేస్తుందని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. మంగళవారం చీపురుపల్లి మండలం పత్తికాయ పాలవలస పంచాయతీ పరిధిలోని కలిసెట్టి బడి గ్రామ ప్రాంతంలో ఇటీవల వర్షాల కారణంగా నేలకొరిగిన అరటిపంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతులను పరామర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా రైతులు పంటలను నష్టపోయినప్పటికీ కనీసం సంబంధిత మంత్రులు గానీ ఎమ్మెల్యేలు గానీ రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. జిల్లాలో ఇటీవల పలుచోట్ల అరటి, బొప్పాయి, అపరాల పంటలు నష్టపోయిన రైతులు తమ కష్టాలను చెప్పుకోలేక తల్లడిల్లి పోతున్నారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి రైతుల నష్టాలను తెలుసుకోవడానికి విజయనగరం జిల్లాలో పర్యటన జరపాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. రైతుల నుండి కనీసం ధాన్యం కొనుగోలు చేయలేదని ఆయన అన్నారు. అపరాలకు జిల్లాలో ఐదుచోట్ల కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రకటనలు చేస్తున్నారు తప్ప వాస్తవానికి ఏ ఒక్క సెంటర్ కూడా ప్రారంభం కాలేదన్నారు. రైతుల సమస్యల పట్ల దృష్టి సారించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా వైసీపీ ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, పతివాడ రాజారావు, గవిడి సురేష్, బెల్లాన త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె

విశాలాంధ్ర - లక్కవరపుకోట: ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులతో సదస్సు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని, కార్మిక చట్టాలను పటిష్ట పరచాలని, కనీస వేతనం ఇవ్వాలని, కార్మికులను గుర్తించి పర్మినెంట్ చేయాలని తిదతర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఎంపీడీవో ఎస్.అప్పారావు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.అనిల్ కుమార్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గాడి అప్పారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దెల రమణ, జిల్లా కమిటీ సభ్యురాలు గొల్ల దేవి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి తరిణి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ రేగిన స్థల వివాదం

బోరు నిర్మాణం ఆపిన రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర - జామి: మండల కేంద్రమైన జామిలోని సర్వే నెం.695లోని స్థలంపై మరోసారి వివాదం రేగింది. స్థానిక జిల్లా పరిసత్ హైస్కూల్ మైదానానికి అనుకుని ఉన్న దాదాపు 83 సెంట్లు ఖాళీ స్థలం ప్రభుత్వ భూమిగా రికార్డులలో నమోదై ఉంది. గతంలో ఈ స్థలాన్ని చుట్టల కార్మికులకు ఇళ్ళ స్థలాలకు ఎంపిక చేశారు. కానీ వారికి అప్పగించకపోవడంతో ఆనాటినుంచి ఇప్పటి వరకు ఖాళీగా ఉంది. ప్రస్తుతం జామిలో ప్రభుత్వ భూములు లేకపోవడంతో నూతనంగా ప్రభుత్వ కళాశాలకు ఈస్థలాన్ని ఇచ్చేందుకు అధికార టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఈ స్థలానికి అనుకుని ఉన్న రంభవీది యాదవ కులస్థులు తమకు ఈ స్థలం కావాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈస్థలం వివాదాలకు నిలయంగా మారింది. తాజాగా పంచాయతీ పాలకులు ఈ స్థలంలో బోరును తీసేందుకు ప్రయత్నించగా కొందరు వర్రి కుటుంబాలకు చెందినవారంతా తమకు ఈ స్థలంలో కొంత మాకు చెందినది ఉందని బోరు తీయవద్దని కోరారు. చిలికి చిలికి గాలివానగా మారడంతో తహశీల్దార్ భరత్‌కుమార్, ఎస్ఐ వీర జనార్ధన్ తదితరులు సంఘటనా స్థలానికి వచ్చారు. పూర్తిగా ఇది ప్రభుత్వ భూమి అని, అలాగే ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా బోరు తీయవద్దని పంచాయితీ వారికి సూచించారు. దీంతో బోరు నిర్మాణం ఆగిపోయింది. కానీ బోరు తీయడం ఆపడంతో అధికార పార్టీ నేతలు తెరవెనుక పాత్ర పోషించారని స్థానికులు అంటున్నారు.

పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ తనిఖీ

విశాలాంధ్ర - దెంకాడ: దెంకాడ మండలం మోపాడ ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న ఒక్కక్క ప్రోగ్రాం గురించి అడిగి తెలుసకున్నారు. లేబరేటరీ గదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ పరిసరాలను కూడా పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కె.శరణ్య, సిహెచ్ఓ రాజు, సిహెచ్.సత్యనారాయణ, యస్.సూరిబాబు, రెహ్మత్ ఉన్నిసా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చిత్తడి నేలలను పరిరక్షించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం జిల్లాలో చెరువులు, కాలువలు తదితర జలావాసాలు, చిత్తడి నేలల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కోరారు. జిల్లా చిత్తడి నేలల (వెట్ ల్యాండ్స్) కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. సేతు మాధవన్ మాట్లాడుతూ జిల్లాలో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా 2,263 చిత్తడి నేలలను గుర్తించి, అటవీశాఖ ద్వారా గ్రౌండ్ ట్రూతింగ్ కూడా పూర్తి చేశారని చెప్పారు. చినపతివాడ, చింతపల్లి గ్రామాల్లో గుర్తించిన రెండు సహజ కాలువలను చిత్తడి నేలలుగా గుర్తించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అయితే దీనికి సంబంధించి సంబంధిత శాఖలనుంచి మూడు రోజుల్లోగా తమ శాఖాపరమైన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. వీటి ఆధారంగా ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామని స్పష్టం చేశారు. ముందుగా జిల్లా అటవీశాఖాధికారి కొండలరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జలావాసాలు, చిత్తడి నేలలను సంరక్షించడానికి తీసుకున్న చర్యలను వివరించారు. దీనికోసం వివిధ శాఖల సహకారంతో, అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయండి: డీపీఎం

విశాలాంధ్ర - భోగాపురం : రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం ఆనందరావు తెలిపారు. భోగాపురం గ్రామంలో కమ్మ పేరంటాలు ఆలయం వద్ద ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగహన సదస్సు నిర్వహించారు. డీపీఎం ఆనందరావు మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా రసాయన ఎరువులు, పురుగుమందులు వీలైనంత తగ్గించి సేంద్రియ విధానంలో పంటలు పండించాలని తెలిపారు. నేలతల్లి ఆరోగ్యం బాగుంటే మనిషి ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. ఎక్కువ రసాయన ఎరువులు వాడడం వలన భూమి విషపూరితంగా మారి దిగుబడులు తగ్గి నాణ్యత లోపిస్తుందని తెలిపారు. ఇందుకోసం నవధాన్య విత్తనాలు తొలకరి వర్షాలు పడిన వెంటనే వేసి 45 రోజులు ఉంచి నేలలో కలియ దున్నాలని తెలిపారు. వ్యవసాయాధికారి హరికృష్ణ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో జీలుగా, కట్టే, జనుము విత్తనాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ టి.వెంకటరావు, సేంద్రియ వ్యవసాయ విభాగం సిబ్బంది, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల గిడ్డంగి పరిశీలన

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు చామలాదేవి అగ్రహారం రెవిన్యూలో గ్రామానికి సమీపంలో సర్వే నెంబర్ 4లో నిబంధనలకు విరుద్ధంగా చామలాదేవి అగ్రహారం గ్రామస్తులు వద్దన్నా రాతి క్వారీల బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల నిల్వ గిడ్డంగిని ఏడువాక ఉమామహేశ్వరరావు నిర్మించారని చామలాదేవి అగ్రహారం గ్రామస్తులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై విశాలాంధ్ర దినపత్రికలో పలుమార్లు వచ్చిన వార్త కథనాలకు స్పందించిన విజయనగరం ఆర్డీఓ మంగళవారం పేలుడు పదార్థాల నిల్వ గిడ్డంగిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ దాట్ల కీర్తి బ్లాస్టింగ్ గిడ్డంగి అనుమతులను చూపించాలని యజమాని ఏడువాక మహేష్‌ను అడగ్గా అతను అనుమతులు చూపించక పోవడంతో అనుమతులతో కార్యాలయానికి రావాలని సూచించారు. గిడ్డంగి ప్రదేశానికి చామలాదేవి అగ్రహారం చుట్టుపక్కల ఉన్న జనావాసాలకు గల దూరాన్ని గూగుల్ సర్వే చేసి పూర్తి నివేదికను అందించాలని మండల సర్వేయర్ గంగాధర్‌కు ఆదేశించారు. ఈ గిడ్డంగి నిర్మాణం వలన తమ గ్రామానికి వ్యవసాయ భూములకు అనేక ఇబ్బందులు కలుగుతాయని ఆర్డీఓ దృష్టికి ప్రజలు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.రాములమ్మ, డిప్యూటీ తహశీల్దారు కే.సన్యాసినాయుడు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మి, మండల సర్వేయర్ గంగాధర్, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

TENDER NOTICE

ANNUAL TRAINING CAMP-II AT SITAM ENGINEERING COLLEGE, GAJULAREGA, VIZIANAGARAM
FROM 15 MAY TO 24 MAY 2025

1. Tender in sealed covers are hereby called for supply of Dry Ration to Annual Training Camp-II to be held at SITAM Engineering College, Gajularega, Vizianagaram from 15 May to 24 May 2025. Last date of the Tender receipt at this Office is by 09 May 2025. The tender be dropped at the under mentioned address:-
2(A)Girls Bn NCC
D.No.25-12-12A, Oruganti Vari Thota,
Dasannapeta, Vizianagaram-535 002

Camp Commandant,
ATC-IISITAM Engineering College
Gajularega, Vizianagaram.

రీ - సర్వేను పరిశీలించిన ఆర్డీఓ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని ఆతవ గ్రామంలో రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్న రీ - సర్వేను మంగళవారం విజయనగరం ఆర్డిఓ దాట్ల కీర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందం చేస్తున్న రీ-సర్వేను పరిశీలించి పలు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జే.రాములమ్మ, డిప్యూటీ తహశీల్దార్ కే.సన్యాసినాయుడు, ఆర్.ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ గంగాధర్, వీఆర్ఓ దేక్క ప్రసాద్, రీ-సర్వే బృందం తదితరులు పాల్గొన్నారు.

గుర్తించిన బ్లాక్ స్పాట్‌లలో మళ్లీ ప్రమాదాలు జరగకూడదు

- ఆ దిశగా ప్రభుత్వ శాఖలు కార్యాచరణ రూపొందించాలి
- రోడ్డుభద్రత కమిటీ సమావేశంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్టుగా గుర్తించిన బ్లాక్ స్పాట్ ప్రదేశాల్లో తదుపరి మరో ప్రమాదం జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత ప్రభుత్వ శాఖలపై వుందని, ఆ దిశగా ఆయా శాఖలు చేపట్టాల్సిన కార్యాచరణపై నివేదిక రూపొందించి రెండు రోజుల్లో సమర్పించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లాలో రోడ్డు భద్రతకు, ప్రమాదాలను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. జిల్లాలో పోలీసు, రోడ్లు భవనాల శాఖలు సంయుక్తంగా తరచు ప్రమాదాలు జరిగే 48 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని రోడ్డుభద్రత కమిటీ కన్వీనర్, రోడ్లు భవనాల శాఖ ఎస్.ఇ. కాంతిమతి తెలిపారు. ఈ ప్రాంతాల్లో రోడ్లలో వున్న లోపాలను గుర్తించి వివిధ ప్రభుత్వ శాఖలు మళ్లీ ప్రమాదాలు సంభవించకుండా చేపట్టాల్సిన చర్యలు, అక్కడ రోడ్లలో చేపట్టాల్సిన సాంకేతిక మార్పులపై కార్యాచరణ రూపొందించాలన్నారు. జాతీయ రహదారులపై రేడియంతో స్టిక్కరింగ్ చేయకపోవడం వల్ల రాత్రివేళల్లో ప్రమాదాలకు కారణమవుతున్నాయని పోలీసు శాఖ అధికారులు వివరించారు. స్పీడ్ బ్రేకర్లు వేసిన చోట్ల రేడియంతో గుర్తులు వేయకపోవడం వల్ల రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు లోనవుతున్నారని దీనిని సరిచేయాలని రోడ్డు భద్రత కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు కోరారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా కార్యాచరణ నివేదికలు అందజేయని ప్రభుత్వ శాఖలకు ఛార్జిమెమోలు జారీ చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఉపరవాణా కమిషనర్ మణికుమార్, రోడ్లు భవనాలశాఖ ఇ.ఇ. జేమ్స్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.పద్మశ్రీరాణి, జిల్లా ప్రజారవాణా అధికారి నారాయణ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల పట్టా హక్కులకై పోరాటం

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: విజయనగరం జిల్లా ఎస్ కోట మండలం గాదిలోవ గ్రామంలో 2018లో లక్ష్మీపురం, మెట్టపాలెం గిరిజనులకు పోడు భూముల పట్టాలు ఇవ్వబడినప్పటికీ, బొడ్డపాడు, గాదిలోవ గ్రామాల 23 మంది గిరిజనులకు పట్టాలు నిరాకరించడం వివాదాస్పదమైంది. బీకేఎంయూ ఈ వివక్షతను ఎదుర్కొని మన్యం జిల్లా ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా, రెవెన్యూ అధికారులు చర్య తీసుకోకపోవడంతో పోరాటానికి సిద్ధమయ్యారు. "2018లో కొందరికి పట్టాలు ఇచ్చినా, 23 మందిని విస్మరించడం అన్యాయం. హక్కుల కోసం పోరాటం తప్పదు!" అని బీకేఎంయూ నాయకులు ప్రతిఘటనకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బి కే ఎం యు నేత అప్పారావు, ఎస్ కోట సిపిఐ మండల కార్యదర్శి కే బీముడు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరమ్మ వర్ధంతి

విశాలాంధ్ర - డెంకాడ: డెంకాడ గ్రామంలో శ్రీ సత్య సాయి బాబా మందిరంలో మంగళవారం సత్యసాయి బాబా అమ్మవారు ఈశ్వరమ్మ వర్ధంతిని శ్రీ సత్య సాయి సేవ సమితి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా మందిరంలో ఉదయం నుండి ఓంకార సుప్రభాతం వేద పఠనం నిర్వహించారు. పిల్లలకు బహుమతులను అందజేశారు. అనంతరం గ్రామంలో పేదలకు 150 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి బాబా కన్వీనర్ సబ్బవరపు సూరి నాయుడు, వశ్రీ తాతారావు, కోఆర్డినేటర్ కే.సింహాచలం, మహిళా కోఆర్డినేటర్ వరలక్ష్మి, బాల వికాస్ రాధా కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత సమాజానికి కృషి చేయాలి

- ఎక్సైజ్ శాఖ సీఐ పామోటి చిన్నమనాయుడు

విశాలాంధ్ర - బొబ్బిలి: నాటుసారా రహిత సమాజం కోసం కృషి చేయాలని ఎక్సైజ్ శాఖ సీఐ పామోటి చిన్నమనాయుడు పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని రామభద్రపురం మండలం గొల్లలపేట పంచాయతీ జోగిందర్ వలస అనే బి కేటగిరి గ్రామాన్ని నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రామంగా గుర్తించినట్లు తెలిపారు. ఈ గ్రామంలో విస్తృతంగా అవగాహన సదస్సులు ప్రతిరోజు నిర్వహించడం, దాడులు చేయడం, తనిఖీలు నిర్వహించామని గ్రామంలో ఉన్న పాత సారా నేరస్తులను బైండోవర్ చేయడం వలన మూడు నెలల కాలంలో గ్రామంలో నాటు సారా తయారు చేసినట్టుగానీ, అమ్మినట్టుగాని ఒక్క ఫిర్యాదు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లలపేట గ్రామ సర్పంచ్ కదుపుకూటి రమ్య, సబ్ ఇన్స్పెక్టర్ బి.రాముడు, గొల్లలపేట పంచాయతీ సెక్రటరీ పార్థసారథి, గొల్లలపేట వీఆర్ఓ ఆనందరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపేటలో నగరపాలక సంస్థ కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర - విజయనగరం: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం 44వ డివిజన్ అయ్యన్నపేట ప్రాంతంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యటించారు. పారిశుధ్య పరిస్థితులను గమనిస్తూనే, వీధి దీపాల నిర్వహణ, మంచినీటి పంపిణీ ఏ విధంగా ఉందో పరిశీలించారు. పర్యటించిన ప్రాంతాలలో అక్కడక్కడ చెత్తాచెదారాలు నిల్వ ఉండడాన్ని చూసి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అలాగే నీటి సరఫరా జరుగుతున్న సమయంలో తప్పనిసరిగా నీటి నాణ్యత పరీక్షలను జరపాలని చెప్పారు. అనంతరం 51 వ నెంబరు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో ఉన్న అన్నాక్యాంటీన్ ను పరిశీలించారు. ఆహారం స్వీకరించే వారు ఎండ బారిన పడకుండా అన్నాక్యాంటీన్ చుట్టూ రూఫ్ ఏర్పాటుకై ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు.

వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్స్‌లు విధించాలి

విశాలాంధ్ర -విజయనగరం: నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలన్నిటికీ ఈ నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్సులు విధించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కార్యదర్శులకు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ శానిటరీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సంస్థలన్నీ విధిగా డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. రెస్టారెంట్లు, నర్సింగ్ హోంలు, వస్త్ర దుకాణాలు, ప్రైవేటు స్కూలు, కళాశాలలు, సినిమా థియేటర్లు, కళ్యాణ మండపాలు వంటి అన్ని వ్యాపార సంస్థలకు డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండేలా చైతన్యం చేసి లైసెన్సులు విధించాలన్నారు. ఇప్పటికే ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉన్నవారు ఫీజులు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలన్నారు. అలాగే నగరంలోని ప్రతి కాలువను శుభ్రపరచి మురికి నీరు సజావుగా ప్రవహించే విధంగా చూడాలన్నారు. రానున్న వర్షాకాలం నాటికి కాలువల్లో పూడికలు లేకుండా చేయాలన్నారు. ప్రధాన కాలువలతో పాటు చిన్న చిన్న కాలువల్లో చెత్తాచెదారాలను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, సీనియర్ అసిస్టెంట్ రమేష్ రాజు పాల్గొన్నారు.

ప్రకృతి సాగులో పండించిన కాయకూరలు, మిల్లెట్స్ తినాలి

విశాలాంధ్ర - కొత్తవలస : ప్రకృతి వ్యవసాయ సాగులో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, వేరుశెనగ కాయలు, ఉల్లిపాయలు, పొడవుచిక్కుడు, మిల్లెట్స్, చిరుధాన్యాలను తినడం వలన మానవాళి ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమని హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ నారాయణరావు, ఎపిఎం (ఎఫ్.పి.ఓ) ఎ.వెంకటరమణ పిలుపునిచ్చారు. కొత్తవలస ఎఫ్.పి.ఓ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద దేవాడ, వియ్యంపేట గ్రామ సంఘాలలో గల రైతు సంఘాల సభ్యులు ప్రకృతి వ్యవసాయ స్టాల్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అధికారులకు, ప్రజలకు ఆకు కూరలు, కాయకూరలను విక్రయించారు. వీటిని వాడడం వలన జీవనప్రమాణ స్థాయి పెరిగి రోగాలు రాకుండా, మంచి ఆరోగ్యంతో ఉంటారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ఉషారాణి, ప్రమీల రాణి, ధావన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిషోర్ వికాసంపై వేసవి శిక్షణ

విశాలాంధ్ర - వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో గల అంగన్వాడీ కేంద్రాలు ఒకటి రెండు మూడులలో గల పిల్లల తల్లులకు, కిషోర్ వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారాలపై అలాగే వారి ఎదుగుదల, రుతుస్రావం, పరిశుభ్రత గురించి కిషోర్ బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్లు మంగ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కి నాగార్జున కృతజ్ఞతలు

విశాలాంధ్ర - చీపురుపల్లి: రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి వర్యులు నారా లోకేష్‌ను విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున మంగళవారం అమరావతిలో కలిశారు. ఇటీవల తనకు ఉమ్మడి విజయనగరం జిల్లా డిసిసిబి అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు లోకేష్ కు నాగార్జున కృతజ్ఞతలు తెలియజేశారు. కష్టపడి పని చేయాలని మంచి భవిష్యత్తు ఉంటుందని నాగార్జునకు లోకేష్ భరోసా ఇచ్చినట్లు నాగార్జున చరవాని ద్వారా విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

విశాలాంధ్ర - డెంకాడ: సమగ్రశిక్ష జిల్లా సెక్టోరియల్ టీమ్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ యొక్క మండల స్టాక్ పాయింట్ అయిన ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల అక్కివరంను సమగ్రశిక్ష సెక్టోరియల్ టీం సి.ఎం.ఓ ఆదినారాయణ, సహా సి.ఎం.ఓ రామారావు మంగళవారం పరిశీలించారు. ఇంతవరకు వచ్చిన స్టాక్ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వివరాలును అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. రూమ్ ప్లాన్ ప్రకారం స్టూడెంట్ కిట్ ఐటమ్స్ వారిగా ఏర్పాట్లు బాగా చేసారని సంతృప్తి వ్యక్త పరిచారు.ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 శ్రీరాము, ఎం.ఆర్.సి. సిబ్బంది, సి.ఆర్.యమ్.టి లు,ఐ.ఈ.ఆర్.పిలు, పార్ట్ టైమ్ ఇనస్ట్రక్టర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట ఆర్టీసీ డిపోలో మంగళవారం స్థానిక డిపో మేనేజర్ కె. రమేష్ ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో మార్చి మరియు ఏప్రిల్ 2025కాలంలో ప్రయాణికులకు అత్యుత్తమ సేవలు అందించి, ఫిర్యాదులు లేకుండా సంస్థకు గణనీయమైన ఆదాయాన్ని సాధించిన కండక్టర్లు, నైపుణ్యంతో డ్రైవింగ్ చేసి అధిక ఇంధన పొదుపు సాధించిన డ్రైవర్లను గౌరవించారు. కండక్టర్లు జి.వి.రమణ, కె.అచ్చయ్యమ్మ, జె.దేముడు, ఎల్.జె.నాదం, బి.నిర్మల, సన్మాన గ్రహీతలు డ్రైవర్లు పి. ఎస్.నాయుడు, బి.ఎస్.రాజు, ఎల్.అప్పారావు, ఓ. బి. రాజులు ఉన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కె.రమేష్ ఉత్తమ ఉద్యోగులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

పన్నుల వసూళ్లలో గణనీయమైన వృద్ధి

విశాలాంధ్ర - విజయనగరం: నగరపాలక సంస్థ నిధుల నిర్వహణ, ఆదాయ,వ్యయాలు మెరుగుగా ఉన్నాయని గణాంక ప్రాంతీయ ఉపసంచాలకులు పి. సీతారామారావు సంతృప్తి వ్యక్తం చేశారు. గత రెండు నెలలకు చెందిన నగరపాలక సంస్థ నిధుల వ్యవహారాలపై గణాంక అధికారులు ఆడిట్ నిర్వహించారు. అనంతరం మంగళవారం కమిషనర్ పల్లి నల్లనయ్య గణాంక అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గణాంక ప్రాంతీయ ఉపసంచాలకులు పి. సీతారామారావు మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో నగరపాలక సంస్థ గణనీయమైన వృద్ధిని సాధించడం సంతోషదాయకమన్నారు. ఇంకా మిగిలి ఉన్న పన్నులను రాబట్టేందుకు అవసరమైన సూచనలను చేశామన్నారు. ఇదే పరిస్థితిలో నిధుల నిర్వహణ ఖర్చులు కూడా సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ కే అప్పలరాజు, జిల్లా గణాంక అధికారి బి.అరుణకుమారి, సహాయ గణాంక అధికారి సిహెచ్ ప్రభావతి, సీనియర్ ఆడిటర్ సిహెచ్ వెంకట సతీష్, ఎం.కిషోర్, టి రమేష్ బాబు, కే వెంకటరత్నం, జూనియర్ ఆడిటర్ ఎంవి అప్పారావు,ఏఓ సీతారామమూర్తి, రోజా వెంకటలక్ష్మి, నర్సింగరాజు తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జ్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్ మే డే వారోత్సవాల్లో భాగంగా విజయనగరంలోని కార్మిక శాఖలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్మిక శాఖలో అమలవుతున్నటువంటి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి సవివరంగా అడిగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఎంతమంది కార్మికులు లబ్ధి పొందారు, వాటి గురించి ఆరా తీశారు. అనంతరం కార్మిక శాఖ భవన ఆవరణలో అసంఘటిత కార్మికులకు న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్ హాజరై మాట్లాడారు. కార్మికులకు ఏ విధమైన న్యాయ అవసరం ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1 5 1 0 0 కి ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని తెలియజేశారు. అర్హులైన అసంఘటిత కార్మికులకు ఈ శ్రమ కార్డులను స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఏ.శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు జి.తిరుపతి పాల్గొన్నారు.

ఆర్డీఓకు ప్రజా సమస్యలు పట్టవా...?

- వాహనాన్ని ఆపినా వెళ్లిపోయిన వైనం
- ఆవేదన చెందుతున్న చామలాదేవి అగ్రహారం గ్రామస్తులు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని చామలాదేవి అగ్రహారం రెవిన్యూలో సర్వే నంబరు 4లో గ్రామ సమీపంలో జనావాసాల మధ్య బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల గిడ్డంగి నిర్మాణం అంటూ కలెక్టర్ గ్రీవెన్స్‌లో పత్రికలలో వచ్చిన వార్త కథనాలకు స్పందించిన రెవెన్యూ డివిజన్ అధికారి దాట్ల కీర్తి మంగళవారం గిడ్డంగి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గిడ్డంగిని పరిశీలించి తిరిగి ముఖం పట్టిన ఆర్డీఓకి చామలాదేవి అగ్రహారం గ్రామస్తులు గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి దగ్గర ఆర్డిఓ వాహనం ఎదురుగా నిలబడి తమ సమస్యలను చెప్పుకోవాలని వాహనాన్ని ఆపినప్పటికీ ఆర్డిఓ వాహనం ఆపకుండా వెళ్లిపోవడంపై పలు అనుమానాలతో కూడిన విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రజల సమస్యలు రెవెన్యూ డివిజనల్ అధికారికి పట్టవా అంటూ అలాగే మండల తహసిల్దారు వాహనం కూడా ఆపినా ఆపకుండా వెళ్లిపోవడం దారుణం అన్నారు.గిడ్డంగిపై వచ్చిన వార్తలకు ఫిర్యాదులపై స్పందించామని వచ్చిన అధికారులు ప్రజలు సమస్యలు చెప్పుకునేంకు ఆర్డిఓ వాహనాన్ని ఆపినా ఆపకుండా వెళ్లిపోవడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరో ఒక వ్యక్తి స్వార్థం కోసం ఒక గ్రామానికి సంబంధించిన గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేయడం దారుణం అన్నారు.రానున్న రోజుల్లో ఆ గిడ్డంగి సమీపంలో ఉన్న భూముల్లో గృహ అవసరాల నిమిత్తం గృహాలను నిర్మించుకునేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్డిఓ మండల తహసిల్దార్ రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులు స్వచ్ఛమైన నివేదికను అందించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. లేనిపక్షంలో ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు తీసుకెళ్లడం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం
నూతన సమావేశ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-జామి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపిడివో నీలం అప్పలనాయుడు తెలిపారు. ఈమేరకు అన్ని మండల అధికారులు సమావేశానికి తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. ఇప్పటికే సమావేశంకు సంభందించిన ఆహ్వానాలను ప్రజా ప్రతినిధులకు, మండల స్థాయి అధికారులకు పాలక వర్గ సభ్యులకు అందజేయడం జరిగిందన్నారు. ఉదయం 11గంటలకు సమావేశానికి హాజరుకావాలని కోరారు. అలాగే మండల పరిషత్ సమావేశం నిమిత్తం కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన సమావేశం హాల్‌ను అదే రోజున ప్రారంభించడం జరుగుతుందని ఎంపిడివో తెలిపారు. ఈకార్యక్రమానికి జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్తోపాటు స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతోపాటు ఇతర ప్రజల ప్రతినిధులు హాజరవుతారన్నారు.

సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతికి సంబంధించి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కొరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయులు విద్యార్థులతో తరగతులు నిర్వహించి పరీక్షలకు సమాయత్తం చేస్తున్నారు. వేసవి సెలవులు అయినప్పటికీ విద్యార్థులను పాఠశాలకు రప్పించి సంబంధిత సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అవసరమైన సూచనలను సలహాలను అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పైడితల్లమ్మ పండుగలో ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర - బొబ్బిలి: మండలం కారాడ గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళాశాసనములతో విజయనగరం వికాస తరంగిణి ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరం (నాల్గవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు) స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 26 నుండి మే 6వ తేది వరకు జరిగిన వేసవి శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా పిల్లలకు భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. చిన్నారులకు నైతిక విలువలు పెంపొందిస్తూ శ్లోకాలు, నీతికథలు, శరీర ఆరోగ్యానికి యోగ, కళలు, భజనలు నేర్పించారు. అందులో భాగంగా చివరి రోజు మంగళవారం ఆధ్యాత్మిక అరుణ మాట్లాడుతూ పట్టణ నలుమూలల నుంచి సుమారు 70 మంది పిల్లలు హాజరయ్యారని వారికి ప్రోగ్రెస్ కార్డులు, బహుమతులు తరంగణి ప్రజ్ఞ వారు ఇవ్వడం జరిగిందన్నారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ శ్రీమాన్ కామరాజు ఈ కార్యక్రమానికి భోజన సదుపాయాన్ని కల్పించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షులు టి.శ్రీనివాసరావు, శ్రీమాన్ రవివర్మ, జిల్లా ప్రజ్ఞ కన్వీనర్ బి.గణేష్, పట్టణ కార్యదర్శి చంద్రిక, ఆధ్యాత్మిక ప్రవచకురాలు అరుణ, సంతోష్, కళ్యాణి, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్ పరిశీలన

విశాలాంధ్ర - వేపాడ: మండల కేంద్రమైన వేపాడ విద్యా వనరుల కేంద్రంలో 2025-26 విద్యా సంవత్సరంకు సంబంధించిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర విద్యార్థుల కిట్స్ యొక్క మండల స్టాక్ పాయింట్‌ను జిల్లా జిల్లా సెక్టోరియల్ బృందం డివైఈఓ కే.వి.రమణ మంగళవారం పరిశీలించారు. ఇంతవరకు వచ్చిన స్టాక్ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వివరాలును అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎస్.నాగభూషణ రావు.పి.బాల భాస్కరరావు, ఎంఆర్.సి సిబ్బంది, సి.ఆర్.యమ్.టి లు, పార్ట్ టైమ్ ఇనస్ట్రక్టర్స్ పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

విశాలాంధ్ర - మెంటాడ: మండలంలోని కొండ లింగాలవలస గ్రామంలో సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా టెంట్లు కుర్చీలు తదితర సామానాలను ట్రాన్స్‌ఫర్ట్ చేసిన ఆటో కొండ లింగాల వలస నుంచి మెంటాడ వెళ్లే దారిలో చింతలవలస గ్రామం శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ఐదుగురు ప్రయాణం చేయగా వారిలో ముగ్గురుకి స్వల్ప గాయాలు కాగా వారిని దగ్గరలో గల చల్లపేట పి.హెచ్.సి కి తరలించి వైద్యం అందించారు.